పిచ్చి బావ - పెంకి మరదలు

- గూటూరి



'హమ్మా...' రిక్షాని పోర్టికోలో పెట్టి ఏడంతస్తుల ఆ భవంతిలోకి రాగానే హీరో పిచ్చిబాబు ఆనందంగా అరిచాడు.

'హేవిటి బాబూ...' ఖళ్‌ఖళ్‌మని దగ్గుతూ పక్షవాతంతో మంచాన పడివున్న హీరో తల్లి పరిగెత్తుకు వచ్చింది.

'ఎన్నాళ్ళ నుంచో నీకో విషయం చెప్పాలనుకుంటున్నా నమ్మా... హి...హి...' సిగ్గుతో మెలికలు తిరిగిపోయాడు పిచ్చిబాబు.

'చెప్పు నాయనా... ఎందుకా సిగ్గు...' ఖళ్‌ఖల్‌మని మరింత దగ్గుతూ ఆయాసంగా అంది పిచ్చిబాబు తల్లి.

'నేనో అమ్మాయిని ప్రేమించానమ్మా... పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను'

'అలాగా చిట్టికన్నా... ఇన్నాళ్ళకు ఈ తల్లి మనసు సంబరపడే మాట చెప్పావు... నాకు మా చెడ్డ సంతోషంగా ఉంది. ఎగిరి గెంతాలని ఉంది... కాని పక్షవాతం కదా... బాగోదు... ఇంతకీ ఎవరా పిల్ల? ఒకసారి తీసుకురా చూస్తాను' ఖళ్‌ఖళ్ దగ్గు ఇంకా ఎక్కువైంది.

'అలాగే... రేపే తీసుకొస్తాను... ఉండమ్మా దగ్గు ఎక్కువైనట్లుంది... డాక్టర్‌గార్కి ఫోన్ చేస్తాను... ఒకసారి రమ్మని'

'వద్దులే బాబూ...'

'అది కాదమ్మా... నువ్వలా ధారాళంగా దగ్గుతుంటే నేను చూడలేను. డ్రైవర్ని పంపి కారులో డాక్టర్‌గార్ని తీసుకురమ్మంటాను' అంటూ ఫ్రిజ్‌లోంచి మంచినీళ్ళు తీసి తల్లికి తాగించాడు.

'ఎందుకు నాయనా... అదే తగ్గిపోతుందిలే. అసలే పేద వాళ్ళం. డాక్టర్లకి అంతంత ఫీజులిచ్చుకోలేం. నీ పెళ్ళి కళ్ళారా చూస్తే ఇక ఈ కట్టె ఉంటేనేం కాలిపోతేనేం...'

'హమ్మా...' గావుకేక పెట్టాడు పిచ్చిబాబు.

'ఏం... బాబూ...' కంగారుపడింది పిచ్చిబాబు తల్లి.

'హెంత మాటన్నావమ్మా... అలాగైతే నేనిక పెళ్ళే చేసుకోనమ్మా. నా పెళ్ళితో నీకు నూరేళ్ళూ నిండిపోవాలా... హయ్యో...'

'అబ్బే... నా ఉద్దేశం అది కాదు నాయనా...'

'లేదమ్మా... లేదు... నువ్వింకేం చెప్పకు. నేనసలు పెళ్ళే చేసుకోను. ఇదే ఈ పిచ్చిబాబు ప్రతిజ్ఞ' అంటూ వీధిలోకి పారిపోయాడు పిచ్చిబాబు.

'అయ్యయ్యో... ఎంత పని జరిగింది... ఈ ఖళ్‌ఖళ్ దగ్గు ఎంత పని చేసింది' అని తలబాదుకుంది పిచ్చిబాబు మాతృమూర్తి.

★ ★ ★

అలా వీధిలోకి పారిపోయిన పిచ్చిబాబు 'లచ్చుమాంబని కలిశాడు పార్కులో.

'లచ్చూ... మన పెళ్ళి జరగడం కష్టం... ఇక నన్ను నువ్వు మర్చిపో' అన్నాడు గడ్డి పీకుతూ.

'ఉన్నట్టుండి అణుబాంబులా ఇదేం మాట పిచ్చూ... నిన్ను వదిలి నేను ఉండగలననే అనుకుంటున్నావా...' అంది వీపు గోకుతూ.

'మరేం చెయ్యమంటావు... మన పెళ్ళి జరిగితే మా అమ్మ బతకదు...' అన్నాడు ముక్కు చీదుకుంటూ.

'అదేం... పాపం' ఆశ్చర్యంగా అడిగింది లచ్చుమాంబ.

'చచ్చిపోతుంది...' విషాదంగా అన్నాడు పిచ్చిబాబు.

'అరే... ఎలాగ...?' మరింత ఆశ్చర్యంగా అడిగింది.

'ఖళ్‌ఖళ్ దగ్గు ఎక్కువై' గద్గదికంగా అని కన్నీళ్ళు తుడుచుకున్నాడు పిచ్చిబాబు తన చొక్కా ఎత్తి.

'అయితే దానికీ దీనికీ ఏమిటీ లింకు?'

'అదంతే... మన పెళ్ళి జరగదు... కాని ఒకటి మాత్రం నిజం... నమ్ము. ఎన్ని జన్మలైనా నువ్వే నా భార్యవు. నిన్నే ప్రేమిస్తూ ఉంటాను. ఇక ఈ జన్మకు పెళ్ళి మాటే లేదు. అమ్మకు అలా మాటిచ్చాను'

'మీ అమ్మ ఖళ్‌ఖళ్ దగ్గు బాగుచేయిద్దాం. మా డాడీ పెద్ద ఖళ్‌ఖళ్ డాక్టర్ కదా... ఫారిన్ నుంచి రప్పిస్తాను'

'నో... నో... మేమంత డబ్బున్నవాళ్ళం కాదు. కడుపేద వాళ్ళమని నీకు తెలీదా. ఇక నువ్వు నన్ను మర్చిపో... సెలవ్' అంటూ డ్రైవర్ని కేకేసి మారుతీ కారులో వెళ్ళిపోయాడు పిచ్చిబాబు.

లచ్చుమాంబ నీరసంగా కూలబడిపోయింది. వస్తున్న ఏడుపుని ఆపబోతే దగ్గొచ్చింది. ఖళ్... ఖళ్... 'ఛీఛీ ఈ ఖళ్‌ఖళ్ పిచ్చిబాబు తల్లిది కదా. నాకు అంటుకుందేమిటి' అనుకుంటుండగానే మెరుపులాంటి ఆలోచన వచ్చి వెంటనే లేచి బయల్దేరింది.

★ ★ ★

'నమస్కారం... అత్తయ్యగారూ!'

'ఎవరమ్మా నీవు... మహాలక్ష్మిలా ఉన్నావు'

'నేను మీ పిచ్చిబాబు ప్రేమించిన లచ్చుమాంబ నండి' సిగ్గుపడుతూ చెప్పింది.

'అలాగా తల్లీ... అందమైన పేరు... ఇంత చక్కని చుక్కవి... ఇంకా ఎందుకు ఆలస్యం... మీ పెళ్ళి వెంటనే జరిపించేస్తాను'

'అదే... ఎలాగ అత్తయ్యగారూ... పిచ్చిబాబు పెళ్ళి చేసుకోనని ప్రతిజ్ఞ చేశాడుగా...'

'ఆ... వాడి ముఖం... మీ పెళ్ళి నేను చేయిస్తాను దగ్గరుండి... ఇంతకీ ఎవరమ్మా నువ్వు... ఎవరి తాలూకా?' ఖళ్‌ఖళ్ దగ్గు మొదలయ్యింది.

'నేను పిచ్చికేశ్వరరావు గారి ఏకైక సంతానమండీ... మా డాడీ ఫారిన్‌లో పెద్ద డాక్టర్...'

'పిచ్చికేశ్వరరావు అంటే... మీది స్వగ్రామం పిచ్చికలపాడు... అవునా...?'

'అవునండీ... భలే కరెక్టుగా చెప్పారే... మీకెలా తెలుసు?'

'ఛీ... ముదనష్టపుదానా... ముందు నువ్వు అర్జెంటుగా ఇక్కడ్నుంచి వెళ్ళిపో. నీ నీడ కూడా నా కొడుకు మీద పడనివ్వను...' ఖళ్‌ఖళ్ దగ్గు ఎక్కువై ఊపిరాడక ఉక్కిరిబిక్కిరవుతున్నా ఆవేశంతో ఊగిపోతోంది పిచ్చిబాబు తల్లి. ఆవిణ్ణి బాగా దగ్గనిచ్చి దగ్గరకొచ్చి నింపాదిగా 'అత్తయ్యగారూ... అసలేమిటి సంగతి?' అనడిగింది లచ్చుమాంబ.

'నోర్ముయ్... అత్త అట అత్త. ఎవతే నీకు అత్త. అత్తగిత్త అన్నావంటే మర్యాద దక్కదు. ఆ దుర్మార్గుడి కడుపున పుట్టినంత మాత్రాన రక్తసంబంధం ఇలా కలుపుకోవాలని చూస్తావా...' అంది ఆగ్రహంగా పిచ్చిబాబు తల్లి.

'అత్తయ్యగారూ... అంటే... అంటే...'

'అవును... ఆ పిచ్చికేశ్వరరావు స్వయంగా నాకు సొంత అన్నయ్య'

'అత్తయ్యా...' ఆనందంగా అరిచింది లచ్చుమాంబ.

'ఛూ... పాపిష్టిదానా... నన్నలా పిలవకు'

'క్షమించండి... నాకు ఇప్పుడే మిమ్మల్ని నోరారా అత్తయ్యా అని మరీమరీ మనసారా పిలవాలనుంది... మనది రక్త సంబంధం నన్ను ఆపకండి... అత్తయ్యా... అత్తయ్యా...' అని గభాల్న కిందకు వంగి దభాల్న కాళ్ళ మీద పడింది లచ్చుమాంబ.

పిచ్చిబాబు తల్లికి పిచ్చి జాలేసింది. ప్రేమ పొంగుకు వచ్చింది.

'అమ్మా... లచ్చుమాంబా...'

'అత్తయ్యా...'

ఇద్దరూ బాగా వెనక్కి వెళ్ళి అట్నుంచి పిచ్చిబాబు తల్లి ఇట్నుంచి లచ్చుమాంబా పరుగెత్తుకు వచ్చి గాఢంగా ఒకర్నొకరు కౌగిలించుకున్నారు.

'అత్తయ్యా... పరవశంగా పిలిచింది లచ్చుమాంబ.

'ఏదమ్మా... మరోసారి పిలు...' తన్మయంగా అడిగింది పిచ్చిబాబు తల్లి.

'అత్యయ్యా...' మళ్ళీ పిలిచింది లచ్చుమాంబ.

'చాలు తల్లీ... ఈ జన్మకిది చాలు. ఖళ్‌ఖళ్... నేనిప్పుడు ఆనందంగా చచ్చిపోగల్ను. పిచ్చిబాబు గురించి ఇంక నాకిక బెంగే లేదు'

'అంత మాటనకండి అత్తయ్యా... మీరు నూరేళ్ళూ ఖళ్‌ఖళ్‌మని దగ్గుతూ సంతోషంగా ఉండాలి. ఇంతకీ మా నాన్న మీకేం ద్రోహం చేశాడత్తయ్యా... మీరున్నట్లు నాకు చెప్పనే లేదే...'

'చెబుతానమ్మా చెబుతాను. మా తల్లిదండ్రులకు మీ నాన్న నేనే సంతానం. తరగని బోలెడు ఆస్తి ఉంది మాకు. పదహారేళ్ళ వయసులో జంతికలు కొనుక్కోడానికి కొట్టుకు వెళ్ళిన నేను ఆ కొట్టులో పనిచేసే మీ మావయ్య ప్రేమలో కొట్టుకుపోయాను. తొలి చూపులోనే ఆయన ప్రేమలో పడ్డాను. ఇద్దరం పెళ్ళి చేసుకున్నాం. ఇది సహించలేక మా నాన్న ఆస్తి అంతా అన్నయ్య కిచ్చేసి గుండెపోటుతో మరణించారు. తర్వాత కొన్ని రోజులకు మీ మావయ్యకు కేన్సర్ వస్తే వైద్యం కోసం మీ నాన్నని సాయం అడిగితే నానా మాటలూ అని చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. మీ మావయ్య కేన్సర్‌తో కుళ్ళి కృశించి చనిపోయాడు. అప్పట్నుంచే నాకు ఈ ఖళ్‌ఖళ్ జబ్బు వచ్చింది. ఆ ఖళ్‌ఖళ్‌లోనే పిచ్చిబాబు పుట్టాడు. మీ మావయ్య వదిలేసిపోయిన జంతికలు అమ్ముతూ ఇటు నేను, రోజంతా రిక్షా తొక్కుతూ అటు పిచ్చిబాబూ... మూట్లెళ్ళకే కోట్లు సంపాదించాం.'

'అంటూ ఖళ్‌ఖళ్ దగ్గు కోసం కొంత ఆగి దీర్ఘంగా నిట్టూర్చింది పిచ్చిబాబు తల్లి. 'అయినా పదో తరగతి పదిసార్లు తప్పి చదువు ఆపేసిన మీ నాన్న ఇలా ఫారిన్‌లో పెద్ద డాక్టరైపోవడం తలుచుకుంటే ఆశ్చర్యంగాను ఆనందంగానూ ఉందమ్మా' అంది.

ఇంతలో పిచ్చిబాబు అక్కడికొచ్చాడు. తల్లి ఒడిలో పడుకుని కబుర్లు చెబుతున్న లచ్చుమాంబని లాక్కెళ్ళి బయటకు తోసి తలుపేశాడు... 'ఛీ... నువ్వు నా తల్లిని చంపడానికే ఇక్కడ చేరావు... పాపాత్మురాలా...' అంటూ.

'బాబూ... ఏవిట్రా ఇది...' అంటూ అడ్డుకోబోయిన తల్లిని

'ఉండమ్మా... నీకేం తెలీదు...' అని చిరాకుపడ్డాడు.

అప్పుడు కోపంగా పిచ్చిబాబు తల్లి ఇలా అంది.

'ఏంట్రా నాకు తెలీనిది... అది ఎవరనుకుంటున్నావు... మా అన్నయ్య పిచ్చికేశ్వరరావు ఒక్కగానొక్క కూతురు... సాక్షాత్తూ నీ మరదలురా...'

'ఆ... ఏవిటమ్మా నీవు అంటున్నది. లచ్చుమాంబ స్వయానా నా మరదలా...'

'అవును బాబూ... పాతికేళ్ళ క్రితం...' అంటూ పిచ్చిబాబు ముఖం మీద క్లోజప్‌లో ఫ్లాష్‌బాక్ చక్రాలు తిప్పి స్టోరీ మొత్తం వినిపించి ఖళ్‌ఖళ్‌మని దగ్గింది.

అంతా విని అయ్యో ఎంత పని జరిగింది. లచ్చూ... నా లచ్చూ...' అని పిచ్చిగా కేకలు పెడ్తూ బయటకు పరుగుతీశాడు పిచ్చిబాబు.

కాని అక్కడ లచ్చుమాంబ లేదు.

★ ★ ★

కట్ చేస్తే...

లచ్చుమాంబని వాళ్ళ నాన్న పిచ్చికేశ్వరరావు విమానంలో ఫారిన్ తీసుకుపోతున్నాడు.

భోరుమంటూ ఏడుస్తున్న పిచ్చిబాబుకి ఈ విషయం అతగాడి పనీపాటా లేని కామెడీ వేషాలేసుకునే ఫ్రెండ్స్ వచ్చి చెబుతారు.

అంతే... వీరావేశంతో అక్కడే వున్న రిక్షా ఎక్కి స్పీడుగా తొక్కుతూ వెళ్తుంటే మార్గమధ్యంలో విలన్ పిచ్చికేశ్వరరావు ఏర్పాటు చేసిన వందమంది గూండాలు అడ్డుపడతారు. హోరాహోరీగా పోరాడి ముష్టి యుద్ధాలు చేసి వాళ్ళందర్నీ చిత్తుచేసి ఒక చక్రం విరిగిపోయిన రిక్షాని జెట్ వేగంతో తొక్కుకొచ్చి విమానాశ్రయం చేరి సరాసరి రిక్షా మీంచి ఎగిరే విమానం పట్టుకొని లోపల నానా బీభత్సం చేసి లచ్చుమాంబని వెంట తెచ్చుకుంటాడు. పిచ్చికేశ్వరరావు విమానం మీంచి పడిపోయి రెక్కల మీద వేలాడుతుంటే పిచ్చిబాబే రక్షిస్తాడు. అంతా పిచ్చిబాబు ఇంటికి వెళతారు. పిచ్చిబాబు ఫ్రెండ్స్ అప్పటికే వాళ్ళింట్లో ఎదురు చూస్తూంటారు.

అక్కడ పిచ్చిబాబు తల్లిని చూసి 'అమ్మా... చెల్లెమ్మా... నన్ను క్షమించు తల్లీ' అని అమాంతం కౌగిలించుకుంటాడు పిచ్చికేశ్వరరావు.

పిచ్చిబాబు తల్లి కూడా 'అన్నయ్యా... మళ్ళీ ఎన్నాళ్ళకు కలిసాం... ఇన్నాళ్ళూ ఏమయిపోయావు అన్నయ్యా...' అంటూ బల్లిలా కరుచుకుపోతుంది.

ఆ దృశ్యం చూసి పిచ్చిబాబు... లచ్చుమాంబా తమ కళ్ళల్లో నిండిన ఆనందభాష్పాలను తుడుచుకొని ఎంతకీ వాళ్ళు కౌగిలి నుంచి విడివడకపోవడంతో కాస్త కోపంగా...

'ఇక చాల్లేండి... అన్నాచెల్లెళ్ళు మీరే అంతసేపు కౌగిలించుకుంటే... మరి బావామరదళ్లం మా సంగతేంటి' అని నిలదీయడంతో అప్పటికి కౌగిలి నుంచి విడివడి ముసిముసి నవ్వులు నవ్వుకుంటారు పిచ్చిబాబు తల్లి, పిచ్చికేశ్వరరావు.

తర్వాత పిచ్చిబాబుకి లచ్చుమాంబకి పెళ్ళవుతుంది రిక్షా కాలనీలో. ఇద్దరూ రిక్షాలో హనీమూన్ కెళ్తుండగా సినిమా ముగుస్తుంది.

★